క్లుప్తంగా

కూలిన ప్రహరీ


కూలిన శ్మశానవాటిక ప్రహరీ

షాద్‌నగర్: పట్టణంలోని మినీ స్టేడియం వద్ద ఉన్న శ్మశానవాటిక ప్రహరీ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో అంత్యక్రియలకు వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. అంతిమ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అస్థికలు భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

సివిల్ ర్యాంకర్‌కు సన్మానం


భరద్వాజ్‌కు స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సివిల్స్‌లో 905వ ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన భరద్వాజ్‌ను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలిసి కాంగ్రెస్ నాయకులు విద్యార్థి ఇంటికి వెళ్లి శాలువా కప్పి సత్కరించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినం సందర్భంగా వికారాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్, మండల అధ్యక్షుడు మానయ్య, వెంకటాపూర్ మహేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

మంచాల: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో మండల పరిధి 93 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట ప్రసాద్ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, గుండమోని జయమ్మ, మండల అధ్యక్షుడు రాంరెడ్డి మండల నాయకులు రమాకాంత్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, ఎడ్మా నరేందర్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, మహేందర్, మిద్దె శ్రీనివాస్‌గౌడ్, జయానందం, ఐల్లయ్య, చంద్రయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

కడ్తాల్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను అధికార పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్, శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడి పిలుస్తోంది

- గ్రామాల్లో విస్తృతంగా ఉపాధ్యాయుల ప్రచారం
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం
- సదుపాయాలు, ఉత్తీర్ణత శాతం పెరగడంతో తల్లిదండ్రుల ఆసక్తి


కొత్తూరు తండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా గురుకులాలు, రెసిడెన్షియల్‌తో పాటు పలు పాఠశాలలను ఏర్పాటు చేస్తూ ప్రతి ఒక విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులు అన్ని రకాల పరీక్షల్లో రాణిస్తున్నారు. దీంతో స్వతహాగా తల్లిదండ్రులే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

జోరుగా ప్రచారం..

గతంలో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించేవారు. బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన మాత్రమే కల్పించేవారు. కాగా ప్రస్తుతం ప్రైవేట్‌ల మాదిరిగా ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఉన్న అభివృద్ధి, వసతులు, పరీక్షల్లో రాణించిన విద్యార్థుల వివరాలతో కూడిన కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. నాయకులు, యువకుల భాగస్వామ్యంతో బడీడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు పిల్లల చదువుపై స్వతహాగా హామీ ఇస్తున్నారు. ప్రైవేట్‌లో చదువుకునే పిల్లల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను తయారు చేస్తామంటూ తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నారు. ప్రభుత్వ విద్యార్థులకు అన్ని రకాల క్రీడలు, వారికి ఆసక్తి ఉన్న వాటిపై శిక్షణ సైతం ఇస్తామంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పలు దఫాలుగా గ్రామాల్లో ప్రచారం చేపట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మండలంలో పాఠశాలలు ఇలా..

మున్సిపాలిటీ, మండలంలో 26 ప్రాథమిక, 03 ప్రాథమికోన్నత, 05 జెడ్పీహెచ్ఎస్, 01 కేజీబీవీ, 01 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. అన్ని పాఠశాలల్లో 2,800ల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

అందరి భాగస్వామ్యం అవసరం



నాయకులు, యువత, ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుంది. ఇప్పటికే ఉపాధ్యాయులు గ్రామాల్లో పలు కార్యక్రమాలను చేపట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ నెల 6 నుంచి బడిబాటలో భాగంగా మరోమారు కార్యక్రమాలను నిర్వహించనున్నాం.

– అంగూర్‌నాయక్, ఎంఈఓ

డబుల్ ఇళ్లు కేటాయించకపోతే..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్


డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మాట్లాడుతున్న నాయకులు, లబ్ధిదారులు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల క్రితమే డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన అప్పటి ప్రభుత్వం 36 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేసిందన్నారు. కానీ ఇళ్లు కేటాయించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకొని ఇళ్లకు మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, గండిపేట మండల కార్యదర్శి డప్పు ప్రవీణ్‌కుమార్, నాయకులు ప్రభుదాస్, లబ్ధిదారులు ఉన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చేవెళ్ల: చేవెళ్ల డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. చేవెళ్లలోని ఎంఈఓ కార్యాలయంలో చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు కొనసాగిస్తూ అధిక మొత్తంలో ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇలాంటి పాఠశాలలు వెలిసి విద్యార్థుల జీవితాలను, తల్లిదండ్రుల ఆశలను ఆవిరి చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రారంభంలోనే విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకపోయినా ప్రచారాలు చేసుకుంటూ పాఠశాలల బోర్డులు పెట్టి అడ్మిషన్లు చేసుకుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి అనుమతులు లేని స్కూళ్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అశోక్ తదితరులు ఉన్నారు.

ధరణి చట్టం ‘కల్వకుంట్ల’కు చుట్టం

- భూభారతితో సమస్యలకు సత్వర పరిష్కారం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


లేమామిడిలో రైతులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అధికారులు

కేశంపేట: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి చట్టం కల్వకుంట్ల కుటుంబానికి చుట్టంగా మారిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని లేమామిడి, ఉప్పలపల్లిలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. లేమామిడి సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన గత పాలకులు ఇష్టానుసారంగా వ్యవహరించి కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావుల కోసమే ధరణి చట్టాన్ని తెచ్చారని ఆరోపించారు. ధరణి చట్టంతో విసిగిపోయిన రైతులు గత ప్రభుత్వ హయాంలో అధికారులపైన యాసిడ్ దాడులు చేసినట్లు, అదేవిధంగా చాలామంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ధరణి లోపాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో షాద్‌నగర్‌కు రాహుల్ గాంధీ వచ్చిన సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తొలగిస్తామని హామీ ఇచ్చారని, మాట ప్రకారం భూభారతిని అమలు చేస్తున్నారన్నారు. రైతులు అధికారులకు సరైన సమాచారం ఇచ్చి సమస్యల పరిష్కారంలో తమవంతు సహకారం అందించాలని కోరారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కేశంపేట, లేమామిడి, తుర్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజామ్ అలీ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాలశ్రావణ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్, రాణి, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మయ్య, సుందరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.


మేడిపల్లిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


రెడ్డిపల్లిలో భూమికి సమాంతరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మొయినాబాద్: గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. భూమికి సమాంతరంగా, కంచె లేకుండా ఇళ్ల మధ్య ఉన్న వాటితో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కంచె లేకుండా..

మండల పరిధిలోని మేడిపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, కుత్బుద్దీన్‌గూడ, మోత్కుపల్లి, వెంకటాపూర్, శ్రీరాంనగర్, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని భూమికి సమాంతరంగా ఉండటంతో విద్యుత్ తీగలన్నీ తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో మనుషులతో పాటు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని, గతంలో వాటి వద్ద కరెంటు షాక్ తగిలి పశువులు మృత్యువాతపడ్డాయి. అయినా విద్యుత్ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కొందుర్గులో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న నాయకులు


కేశంపేట: బడిబాట నిర్వహిస్తున్న సంఘం నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. బుధవారం మండలంలోని అయోధ్యాపూర్‌తండా, రామచంద్రాపూర్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్, చౌదరిగూడ, తూంపల్లి గ్రామాల్లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, నాణ్యమైన భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటయ్య, నాయకులు శివారెడ్డి, శేఖర్‌గౌడ్, రంగరాజన్, ప్రకాశ్, రాములు, సంజీవ్, నర్సింలు, విజయ్, గోపాల్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

కేశంపేట: బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్ కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు ఆయన సంఘం నాయకులతో కలిసి బుధవారం మండలంలోని దత్తాయపల్లి, ఇప్పలపల్లి, సంతాపూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను వివరించారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యం, రామకృష్ణ, వినిత్‌గౌడ్, రాజు, అరుణ్, శ్రీశైలం, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

శాస్త్రవేత్తలు మహదేవప్ప, రమేశ్


పంటల సాగుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

మొయినాబాద్‌రూరల్: రైతులు విత్తనాల ఎంపికలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మహదేవప్ప, రమేశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడే అధిగ దిగుబడి సాధిస్తారన్నారు. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. మెలకువలు పాటించి అధిక దిగుబడి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్, రైతులు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా


తైబజార్ వేలంలో గ్రామస్తుల వాదోపవాదాలు

కొందుర్గు: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే కూరగాయల సంతకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తైబజార్ వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కార్యదర్శి సురేఖ, ఎంపీఓ విజయ్‌కుమార్ సమక్షంలో జీపీ కార్యాలయం వద్ద వేలం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు హాజరై వేలంను అడ్డుకున్నారు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న వీధిలో కూరగాయల సంత సాగుతోంది. అయితే ఈ సంతను ఉమ్మెంత్యాల రోడ్డుకు మార్చాలని కొందరు.. సంతను ఇలాగే ఉంచాలని మరికొందరు వాదోపవాదాలకు దిగారు. దీంతో అధికారులు వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రెండోరోజు కొనసాగిన రెవెన్యూ సదస్సులు

- రైతుల నుంచి అర్జీల స్వీకరణ
- పాల్గొన్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది నాయకులు


షాద్‌నగర్: రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్థసారధి

చేవెళ్ల: మండలంలోని కందవాడ, తంగడపల్లి గ్రామాల్లో బుధవారం రెండోరోజు రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. రైతుల నుంచి మొత్తం 106 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార కృష్ణయ్య తెలిపారు. కందవాడలో తహసీల్దార్ కృష్ణయ్య, తంగడపల్లిలో నయాబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా తంగడపల్లిలో 24 ఫిర్యాదులు, కందవాడలో 82 ఫిర్యాదులు వచ్చినట్లు స్పష్టం చేశారు. రైతులు అధైర్యపడొద్దని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీనిచ్చారు. రైతులు, ప్రజలు గ్రామాల్లో జరుగుతున్న ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో రైతుల నుంచి 39 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది బాలకృష్ణ, ఎల్లయ్య, మహేశ్, మహేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో రైతులకు మేలు

షాబాద్: రైతుల మేలు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎండీ అన్వర్, సీఐ కాంతారెడ్డితో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, సహకార సంఘం మాజీ చైర్మన్ బండ మహేందర్‌గౌడ్, నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కొత్తూరు: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి కోరారు. మండలంలోని కొడిచర్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా కొడిచర్లలో 21, ఖాజీగూడతండా నుంచి 02 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. వచ్చిన దరఖాస్తులను రైతులు, గ్రామస్తుల సమక్షంలోనే విచారించి, రికార్డులను పరిశీలించిన తర్వాత పది దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. మిగిలిన దరఖాస్తులను ఆయా కారణాలతో తిరస్కరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐలు రాంబాబు, సంజీవ, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పార్థసారధి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో తహసీల్దార్, శేరిగూడలో డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేశారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.


చేవెళ్ల: కందవాడలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు



కొత్తూరు: కొడిచర్లలో వెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు


మొయినాబాద్: మోత్కుపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్